చినుకు... వణుకు


చంద్రేడులో కూలీల కొరతతో పంటను కుప్పలుగా వేస్తున్న రైతులు


మెషీన్ ద్వారా మినుము నూర్పిడి చేస్తున్న రైతులు

- గుబులు పుట్టిస్తున్న వర్షాలు
- హడావుడిగా నూర్పిళ్లు
- వేధిస్తున్న కూలీల కొరత

రంగంపేట: ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే సమయంలో వర్షాలు వణుకు పుట్టిస్తున్నాయి.. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రంగంపేట మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 3,591 ఎకరాల్లో మినుము పంట చేశారు. వడిశలేరు, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, ముకుందవరం గ్రామాల్లో అధికంగా ఈ పంట పండించారు. ప్రస్తుతం పంట నూర్పిళ్ల దశకు చేరుకుంది. ఈ సమయంలో వర్షాలు రైతులను కలవరపెడుతున్నారు. అధిక వర్షాలు పడితే పంట తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు మినుము తీత ప్రారంభించారు. మరికొందరు కూలీలతో నూర్పిళ్లు చేయిస్తుండగా, కూలీల కొరత కారణంగా ఎక్కువ మంది మెషీన్లతో ఈ పనులు చేస్తున్నారు. మెషీన్లతో కోతకు ఎకరానికి రూ. 4 వేలు ఖర్చవుతుందని, తక్కువ సమయంలో పంటను ఒబ్బిడి చేసుకోవచ్చనే ఉద్దేశంతో రైతులు యంత్రాలను వాడుతున్నారు. ఎకరానికి రూ.18 నుంచి 20 వేల వరకూ శిస్తు చెల్లించి ఎకరాకు రూ. 30 వేల వరకూ పెట్టుబడి పెట్టామని, ఈ దశలో వానలు వస్తే పూర్తిగా నష్టాల పాలవుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ అనుకూలిస్తే...

వాతావరణం అనుకూలించి అన్నీ సవ్యంగా సాగితే ఎకరానికి 10 నుంచి 12 బస్తాల దిగుబడి వచ్చే మినుములు ఈ ఏడాది ఎకరానికి 6 నుంచి 8 బస్తాలు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. ఎకరానికి 10 బస్తాల దిగుబడి ఉంటేనే లాభం ఉంటుందని, లేకపోతే నష్టాలు తప్పవంటున్నారు. ఈ ఏడాది మినుములకు ప్రభుత్వం రూ.6,600 మద్దతు ధర ప్రకటించగా, బయట మార్కెట్‌లో రూ.10,500 ఉండటంలో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా వర్షాలు రాకుండా ఉంటే పంట చేతికి అందుతుందని రైతులు అంటున్నారు.

దిగుబడి, ధర బాగుంది



గ్రామంలో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని మినుము పంట వేశాను. పంట చేతికందే సమయంలో వర్షాలు పడడంతో ముందుగానే నూర్పిడి చేశాను. ఎకరానికి 6 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. ధర బాగుండటంతో బయట మార్కెట్‌లో విక్రయించాను. పెట్టుబడి పోను కొంత మొత్తం లాభం వచ్చింది.

– కంటిపూడి సత్యనారాయణ, కౌలు రైతు, చంద్రేడు

నాలుగు రోజులుగా వానలు



నాలుగు రోజులుగా చుట్టు పక్కల ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని ఐదెకరాల్లో మినుము, రెండు ఎకరాల్లో బెండ సాగు వేశాను. మరో వారంలో మినుము పంట చేతికి వస్తుంది. ఈ లోపు వర్షాలు గుబులు రేపుతున్నాయి. దేవుడి దయతో వర్షం రాకుంటే గట్టెక్కుతాం.

– ప్రసాద్, కౌలు రైతు, రంగంపేట

క్లుప్తంగా

బాణసంచా తయారీ కేంద్రాల పరిశీలన


బిక్కవోలులో బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కిశోర్ కుమార్

బిక్కవోలు: మండలంలోని బాణసంచా తయారీ కేంద్రాలను ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ పరిశీలించారు. శనివారం ఆయన బిక్కవోలులో రెండు కేంద్రాలు, పందలపాకలో ఓ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న దీపావళి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. బాణసంచా కేంద్రాల్లో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని తనిఖీ చేస్తున్నామన్నారు. సీఐ పి.శివగణేష్, ఎస్సై పి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సామగ్రి విక్రయాలకు స్థల పరిశీలన


గోకవరం సంత మార్కెట్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోకవరం: దీపావళిని పురస్కరించుకుని మందుగుండు సామగ్రి అమ్మకాలకు అనువైన స్థలాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. స్థానిక సంత మార్కెట్లో స్థలాన్ని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఫైర్ ఎస్సై ఆర్.గోవింద, గోకవరం ఎస్సై యువి శివనాగబాబు, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు పరిశీలించారు. మందుగుండు సామగ్రి అమ్మకాలు చేపట్టే ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వరసాల ప్రసాద్, పులపర్తి బుజ్జి, వ్యాపారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు


గోకవరం ప్రభుత్వాస్పత్రి అభివృద్ధిపై చర్చిస్తున్న కమిటీ సభ్యులు

గోకవరం: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సూరారెడ్డి, పెనుగొండ సత్యానందం, తుర్రం సత్యవతి అన్నారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ కన్వీనర్ డాక్టర్ వనజకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. నూతన ఆస్పత్రి భవనం నిర్మాణం పూర్తికావస్తుందని, డిసెంబర్‌లో ప్రారంభిస్తామన్నారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.పద్మజ్యోతి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, డాక్టర్లు రవి కుమార్, చైతన్య, రామలక్ష్మి, గంగాధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం


బలభద్రపురం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ పోసిబాబు

బిక్కవోలు: కొత్త ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి నిర్వహిస్తున్న శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పోసిబాబు పిలుపునిచ్చారు. శనివారం బలభద్రపురంలో పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొత్తగా ఓటు నమోదుకు 86, చనిపోయిన వారి ఓటు తొలగింపునకు 15, తప్పుల సవరణకు 86 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

స్పందనకు అధికారులంతా హాజరుకావాలి

రాజానగరం: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. అయితే ఈ కార్యక్రమానికి కొందరు మండల స్థాయి అధికారులు హాజరుకావడం లేదన్నారు. ఇకపై ఆ విధంగా ఎవరైనా గైర్హాజరైతే కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని హెచ్చరించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో గడప గడపకూ..


పెదపూడిలో పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా కలిగిన లబ్ధిని ఆయన వివరించారు. పలు సమస్యలను స్థానికులు వివరించగా తక్షణం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో ప్రభుత్వ పథకాలు అర్హుల ఇంటికే చేరుతున్నాయన్నారు. వలంటీర్లు సైనికుల్లా పనిచేస్తూ సేవలందిస్తున్నారని కొనియాడారు. దీంతో ఏ గడపకు వెళ్లినా ప్రజలు ముఖ్యమంత్రి జగన్ పాలనను ఆశీర్వదిస్తున్నారని అన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పెదపూడి మండలాన్ని కాకినాడ జిల్లాలో కలపడానికి విశేషంగా కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి తామంతా జీవితాంతం రుణపడి ఉంటామని ప్రజలు చెప్పారు. దీంతో గ్రామంలో ప్రజలు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. ఎమ్మెల్యేకు సన్మానం చేసి హారతులు ఇచ్చారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజుచౌదరి, కాకార సాయిబాబు, కోరా బాబి, పప్పు సింహాచలం, తిప్పాన వెంకటరమణ, మీసాల నాగరాజు, పందిరి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఏడీబీ రోడ్డుపై ప్రయాణానికి బెంబేలు

- చినుకు పడితే అవస్థలే
- గోతులతో పొంచి ఉన్న ప్రమాదం
- గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్


వెంకన్నపేట వద్ద ఏడీబీ రోడ్డుపై నిలిచిన ట్రాఫిక్

రాజానగరం: రాజానగరం నుంచి కాకినాడకు వెళ్లే ఏడీబీ రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ఏర్పడిన గోతులతో పాటు, రోడ్డు పాడవడంతో పడిన గుంతలు నరకం చూపిస్తున్నాయి. ఈ తరుణంలో వర్షం కురిస్తే ఇక వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రంగంపేట మండలం వడిశలేరు నుంచి వెంకన్నపేట వరకూ గంటల కొద్దీ ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కురిసిన కొద్దిపాటి వర్షానికి కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. పర్లాంగు దూరం దాటాలంటే చాలు రెండు, మూడు గంటలు సమయం తీసుకోవంతో వాహన చోదకులు విసిగిపోయారు. బైకులపై ప్రయాణించేవారు ఏదో విధంగా ముందుకు సాగినా, ఆటోలు, కార్లు, బస్సుల్లో ప్రయాణించే వారు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో ఏర్పడిన రెండు గోతులు పెద్దవవ్వడంతో వర్షం నీరు నిండిపోయి చెరువుల్లా మారాయి. ఆ గోతులను గమనించని కొందరు ద్విచక్ర వాహన చోదకులు పడిపోయారు. అలాగే కార్లు, బస్సులు, లారీలు మార్గం లేక నిలిచిపోయాయి. దీనితో అటు రంగంపేట, ఇటు రాజానగరం వైపు భారీగా ట్రాఫిక్ స్థంభించింది.

దేవాలయాల అభివృద్ధికి కృషి


శహపురంలో రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: హిందూ దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శహపురం గ్రామ శివారు ఆడదా నిరేవు వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.10 లక్షలతో రామాలయం నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. సామాజిక సేవల్లోనూ అంతా ముందుండాలన్నారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చందాళ్ల పార్వతి, పార్టీ జిల్లా నాయకుడు వనుం చిన వెంకటరమణ, మండల సాంస్కృతిక విభాగం కన్వీనర్ బుద్దాల శ్రీను, యాళ్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా డ్రైనేజీ నిర్మాణ పనులు


సింగంపల్లిలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు

రంగంపేట: సింగంపల్లి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను శనివారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఎప్పటి నుంచో ఉన్న డ్రైనేజీ సమస్య ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చొరవతో పరిష్కారమైంది. దీనికి ఎస్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు కావడంతో కాలువ నిర్మాణం చేపట్టామన్నారు. మరో వారం పది రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని ఆయన తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిత


బాస్కెట్‌బాల్ అండర్-14 విభాగానికి ఎంపికైన బాలికల జట్టు

పెదపూడి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. జి.మామిడాడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ అండర్-14, 17 బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలు శనివారం పూర్తయ్యాయి. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 400 మంది క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొన్నారన్నారు. ఇందులో అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలుర, బాలికల జట్లను ఎంపిక చేశారన్నారు. వీరంతా రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. హెచ్ఎం శ్రీనివాస్, పీడీలు గోపాలకృష్ణ, బి.త్రినాథ్‌వర్మ, రమేష్, తాడీ వీర్రాఘవరెడ్డి, గొలుగూరి గౌరీశంకర్‌రెడ్డి, నల్లమిల్లి అప్పారెడ్డి, భీమేష్, బుల్లిగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనకు రాట ముహూర్తం


వీరుళ్లమ్మ ఆలయం వద్ద రాట వేస్తున్న కమిటీ సభ్యులు

అనపర్తి: స్థానిక గ్రామ దేవత వీరుళ్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఈ నెల 19న జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి ఆలయాన్ని ఇటీవల పునర్నిర్మించారు. దీంతో ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి నిర్వహించే పూజా కార్యక్రమాలకు శనివారం కమిటీ ప్రతినిధులు ఆలయ ప్రాంగణం వద్ద రాట ముహూర్తం చేశారు. ఇందులో భాగంగా పూజలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 17 నుంచి 19వ తేదీ వరకూ విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి వివిధ పూజలు జరుపనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి


పోతురాజు (ఫైల్)

పెదపూడి: గంగ్రేడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత గుత్తుల పోతురాజు శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం పోతురాజు కుమారుడు ఎంపీటీసీ సభ్యుడు శివకుమార్, కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభివృద్ధికి పోతురాజు అందించిన సేవలు మరువలేనివన్నారు. సర్పంచ్ కుడిపూడి మాధవీలత, ఉప సర్పంచ్ కె.శ్రీనివాసు, మాజీ సర్పంచ్ ఎస్.వీరవెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

అనపర్తి: ఇటీవల మాజీ ఎంపీపీ కర్రి లక్ష్మీనారాయణరెడ్డి (లచ్చారెడ్డి) మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శనివారం పరామర్శించారు. లచ్చారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తప్పులు లేకుండా ఓటర్ల జాబితా


బీఎల్ఓకు సూచనలిస్తున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో ఆర్డీఓ చైత్రవర్షిణి


సీటీఆర్ఐ సమీపంలోని పాఠశాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న బీఎల్ఓ కరుణశ్రీ

- కలెక్టర్ మాధవీలత
- ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాల పరిశీలన

రాజానగరం: ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా ఓటర్ల జాబితాలను తయారుచేయడంలో కీలక బాధ్యత బీఎల్ఓలదేనని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని మూడు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ల నమోదు ప్రక్రియను శనివారం ఆమె పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు. జాబితాలో కచ్చితంగా ఆయా ఓటర్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. ఓటరు నమోదు, సవరణలకు ఫారమ్ 6, ఫారమ్ 8లలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారని సిబ్బందిని ప్రశించి, వివరాలు తెలుసుకున్నారు. డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన వారు జాబితాలో లేకుండా శ్రద్ధ తీసుకోవాలన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ అయిన తరువాత ఒకటికి రెండుసార్లు పరిశీలన చేసుకుని, తుది జాబితాను తయారు చేయాలన్నారు. కలెక్టర్ వెంట రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్రవర్షిణి, రాజానగరం తహసీల్దార్ పవన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రాంబాబు కుటుంబానికి పరామర్శ

మధురపూడి: కోరుకొండకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ బావన రాంబాబు కుటుంబ సభ్యులను శనివారం పలువురు ప్రముఖుల పరామర్శించారు. రాంబాబు ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. బీజేపీ రాష్ట్ర నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి, గణపతి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిబాబా

పెదపూడి: సచివాలయాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ వీవీ సాయిబాబా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రజా సేవలు, పథకాలకు సంబంధించిన రికార్డులు నిబంధనల ప్రకారం భద్రపరచాలన్నారు. గ్రామాల వారీగా కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరు ఎలా ఉందో సమీక్షించారు. ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, యాళ్ల ఉమామహేశ్వరరావు, అచ్చిరాజు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే జగనన్న సురక్ష


పల్లకడియంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రాజానగరం: రాష్ట్రంలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. పల్లకడియం సచివాలయం వద్ద శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ టి. రవికుమార్ పర్యవేక్షణలో శిబిరానికి వచ్చిన 603 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 113 మంది కంటి వైద్య పరీక్షలు చేయించున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ వివిధ రకాల ఆహార పదార్థాలతో కూడిన స్టాళ్లను ఏర్పాటుచేశారు. తహసీల్దార్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

రేపు సంపత్ నగరంలో ..

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం సంపత్ నగరంలో వైద్యశిబిరం జరుగుతుందని ఎంపీడీఓ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆర్టీసీ డోర్ డెలివరీపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ఎంపిక చేసిన 84 పట్టణాల్లో 10 కిలోమీటర్ల పరిధిలో 50 కేజీల వరకూ డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం కోరారు. ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలను పురస్కరించి శనివారం నగరంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఇతర రవాణా సంస్థలు ఇవ్వలేనంత అత్యంత చౌకధరలతో, కేవలం గంటల వ్యవధిలో రాష్ట్రం నలుమూలలకు డోర్ డెలివరీ చేస్తున్నామన్నారు. ఔత్సాహిక యువతను ప్రోత్సహించేందుకు ఫ్రాంచైజీలు అందజేస్తున్నామన్నారు. నగర పరిధిలో రూ. 5 వేలు, మున్సిపాలిటీలలో రూ.2,500, గ్రామ పరిధిలో రూ.వెయ్యి ఆర్టీసీకి చెల్లించి తమ వ్యాపారంలో భాగస్వాములు కావచ్చున్నారు. కార్యక్రమంలో మాధవ్ ఏటీఎం (కమర్షియల్), కొవ్వూరు, గోకవరం, నిడదవోలు ఆర్టీసీ డిపో మేనేజర్లు, గ్యారేజీ సిబ్బంది, అసోసియేషన్ నాయకులు, హమాలీలు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి పింఛన్ పంపిణీ


విజయవాడలో త్రివేణికి పింఛన్ అందిస్తున్న వలంటీర్, గృహసారథి

మధురపూడి: కోరుకొండకు చెందిన గెడ్డం త్రివేణి ఇటీవల ప్రమాదవశాత్తూ కాలికి దెబ్బ తగిలి గాయపడింది. విజయవాడలోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొంది, అక్కడే కృష్ణలంకలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో కోరుకొండ సచివాలయం-2లోని క్లస్టర్-20కి చెందిన వలంటీర్ చెరుకూరి సంకీర్తి, గృహసారథి చెరుకూరి చినబాబు శనివారం విజయవాడ వెళ్లి ఆమెకు వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

జగన్మాత అనుగ్రహంతోనే విజయం

సీటీఆర్ఐ: జగన్మాత అనుగ్రహం వల్లనే ఇంత చక్కని ఆలయం నిర్మించగలిగారని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ వీప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక లింగంపేట, కొత్తరోడ్డు వాంబే గృహాల వద్ద శనివారం జరిగిన విజయదుర్గమ్మ, గణపతి శివలింగ ప్రతిష్ఠా మహోత్సవాలలో ఆయన పాల్గొన్నారు. ఆలయ నిర్మాణ కర్తలు పడాల వెంకటేష్, శివలక్ష్మి దంపతులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రాంతంలో ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. నగరంలో ప్రధాన డ్రైనేజీలను నూతనంగా నిర్మిస్తున్నామని, చాలా వరకూ నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు.

ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం

మధురపూడి: కోరుకొండ మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ప్రశాంతంగా జరిగింది. వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ఉల్లి వీరవెంకట సత్య సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 2024 – 25 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌పై చర్చ జరిగింది. అనంతరం సమావేశం ఆమోదించింది. రూ.21 కోట్లతో కూడిన ఈ బడ్జెట్ అభివృద్ధి సోపానంగా నిలుస్తోందని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అన్నారు. పార్టీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.